

# హుస్సేన్ మై ఫాదర్

సువర్ణకుమార్

తాతయ్య @ 80.
ఖరీదైన ఆ హోటల్ కాన్ఫరెన్స్ హాల్లో కనిపిస్తున్న భారీ పోస్టర్ మీదున్న టైటిల్ అది.
ఆ టైటిల్‌కు కుడివైపున ఓ ఆయిల్ పెయింటింగ్ వేలాడుతోంది.
అది కత్తి జాన్సన్ పోర్ట్రెయిట్.

నిజానికి జాన్సన్ అనామకుడు. ఎట్టోళ్ల ఇంట్లో పుట్టిన అతను పెద్దగా చదువు కోలేదు. రైల్వేలో క్లాస్ ఫోర్ ఉద్యోగం చేసి ఇరవై ఏళ్ల క్రితం రిటైరయ్యాడు. అతనికున్న ఆస్తల్లా నలుగురు పిల్లలే. పిల్లల్ని చదివించడానికి జాన్సన్, సుశీలమ్మ తమ శక్తికి మించి కష్టపడ్డారు.

అందరూ చక్కగా చదువుకున్నారు. ఆడపిల్లలు ముగ్గురూ ఉద్యోగాలు చేస్తూ జీవితంలో స్థిరపడ్డారు. ఇప్పటికీ పెళ్లి కానిది, ఇంకా స్థిరపడనిదీ జాన్సన్, సుశీలమ్మల చిన్నకొడుకే.

ఆ ఖరీదైన హోటల్లో సందడి అంతా ఇప్పుడా చిన్న కొడుకు డేవిడ్ చుట్టే తిరుగుతోంది. జాన్సన్ 80వ పుట్టినరోజు సందర్భంగా ఏర్పాటుచేసిన ఆ వేడుకలకు బంధుమిత్రులతోపాటు చాలామంది ప్రముఖులు వచ్చారు. హైదరాబాద్‌లోని పేరుమోసిన ఆర్టిస్టులంతా దిగారు. ఓ పాతిక ముప్పైమంది అప్‌కమింగ్ ఆర్టిస్టులు, ఫైనార్ట్స్ విద్యార్థులు డేవిడ్ చుట్టూ చేరి ఎడ్మైర్ చేస్తున్నారు. ఆ వాతావరణం చూస్తే అది డేవిడ్ జన్మదిన వేడుకలా ఉంది తప్ప అతని తండ్రి జాన్సన్ పుట్టిన రోజు వేడుకలా లేదు. నిజానికి, డేవిడే లేకపోతే అక్కడంత సందడి ఉండేది కాదు.

అలాగని, డేవిడ్‌కూ ఆ వేడుకకూ నేరుగా ఎలాంటి సంబంధమూ లేదు. ఇదంతా జాన్సన్ ముగ్గురు కూతుళ్లు, వాళ్ల పిల్లలు కూడ బలుక్కొని చేసిన ఏర్పాటు. ముఖ్యంగా డేవిడ్ మేనల్లుడు రామ్ దీని ఈవెంట్ మేనేజర్. హడావిడి అంతా అతని పుణ్యమే.

ఎక్కడి ఎట్టిపాలెం! ఎక్కడి ఈనాటి వైభోగం! గతాన్ని నెమరు వేసుకుంటున్న ఎనభై ఏళ్ల జాన్సన్ కళ్లల్లో ఆ సంతృప్తి తాలూకూ మెరుపు స్పష్టంగా కనిపించింది. దాన్నిచూసి సుశీలమ్మ కళ్లలో నీళ్లు సుడులు తిరిగాయి. కూతుళ్లు, అల్లుళ్లు, మనవళ్లు, మనవరాళ్లు... అన్నిటికీ మించి అంత ఎత్తు ఎదిగిన కొడుకు డేవిడ్ కళ్లెదుట కదలాడుతుంటే ఆ దంపతులకు జన్మ ధన్యమైనంత సంబరంగా ఉంది. ఎట్టిపాలెం నుంచి వచ్చిన బంధువులు, ఉద్యోగం చేస్తూ ఊళ్లు తిరిగినప్పటి నాటి సహచరులు కలగన్నట్టుగా ఆ వేడుకలో ప్రత్యక్షమవడం వారి ఆనందాన్ని రెట్టింపు చేసింది.

డేవిడ్ మేనల్లుడు రామ్ పథకం ప్రకారమే అంతా జరుగుతోంది. అతని పట్టుదలకు పరాకాష్ట ఏమంటే, పాతికేళ్ల కిత్రం మద్రాసులో సెటిలైన రిటైర్డ్ స్టేషన్ మాస్టర్ రామకృష్ణాచారిని, వాళ్ల అమ్మాయి నర్తకిని ఈ ఫంక్షన్‌కు రప్పించగలగడం. తనకు ఇలాంటి పిలుపొస్తుందని ఆచారి కలలో కూడా అనుకోలేదు. జాన్సన్, సుశీలమ్మ అంతకన్నా ఊహించలేదు. అందర్నీ సర్‌ప్రైజ్ చేశాడు రామ్. ఆచారిని చూడగానే జాన్సన్ చిన్నపిల్లాడిలా ఏడ్చాడు. ఉద్వేగంతో ఆచారి గొంతూ పూడుకుపోయింది. ఆయన వెంట భార్య పద్మావతి లేకపోవడం

చూసి సుశీలమ్మ కొంగు నోట్లో కుక్కుకొని వెక్కివెక్కి ఏడ్చింది.

చిత్తూరు జిల్లా పాకాలలో దాదాపు పదేళ్లు ఒకే స్టేషన్లో రామకృష్ణాచారి, జాన్సన్ కలిసి పనిచేశారు. ఆచారి స్టేషన్ మాస్టరయితే, జాన్సన్ కేబిన్ మ్యాన్. వాళ్లుంటున్న క్వార్టర్స్ దగ్గర దగ్గర కావడం వల్ల రెండు కుటుంబాలూ ఆత్మీయంగా ఉండేవి. ఆచారికి ఒక కొడుకు, ఒక కూతురు. ఆ పిల్లలూ, జాన్సన్ పిల్లలూ రైల్వే స్కూల్లో చదివేవాళ్లు. జాన్సన్ కొడుకు డేవిడ్, ఆచారి కూతురు అలివేలు ఒకే ఈడు, ఒకే తరగతి.

అలివేలు చాలా తెలివైన పిల్ల. స్కూల్లో ఎప్పుడూ ఆ పిల్లవే ఫస్ట్ మార్కులు. ఆ తెలివికి తగ్గట్టే చూడ ముచ్చటగా ఉండేది. డేవిడ్ మాత్రం వారంలో రెండ్రోజులు స్కూలుకు వెళితే గొప్ప. డేవిడ్ స్కూలు ఎగ్గొట్టి బావుల్లో చేపలు పట్టే పనిలో పడ్డాడని అలివేలు చెబితే గానీ సుశీలమ్మకు తెలిసేది కాదు. కడుపు మండి సుశీలమ్మ రెండు దెబ్బలేస్తుండేది. అలివేలు కారణంగా దెబ్బలు తినాల్సి వచ్చినా ఆ చురుకైన పిల్లంటే డేవిడ్‌కు చాలా ఇష్టం. అలివేలూ అంతే. సెలవొస్తే ఆటల్లో జంటగా కనిపించేది వాళ్లిద్దరే. ఐదో తరగతి తర్వాత అలివేలును వాళ్ల నాన్న రిషీవ్యాలీ స్కూల్లో చేర్చేదాకా ఈ స్నేహం కొనసాగింది. తర్వాత రామకృష్ణాచారి ట్రాన్స్‌ఫర్ మీద వేరే ఊరెళ్లడంతో సంబంధాలు పూర్తిగా తెగిపోయాయి.

*

ఆ ఖరీదైన హోటల్ కాన్ఫరెన్స్ హాల్లో ఒకవైపు డేవిడ్ కేంద్రంగా హడావిడి సాగుతుంటే, హాల్లో మరో వైపు నర్తకి చుట్టూ సందడి నెలకొంది. కాకపోతే ఇక్కడ ఎక్కువమంది ఆడవాళ్లు ఉన్నారు. పట్టుచీరల్లో ధగధగ మెరిసిపోతున్న ఆర్టిస్టుల భార్యలు ఆ గుంపులో ప్రత్యేకంగా కనిపిస్తున్నారు. నర్తకి మాత్రం చాలా సింపుల్‌గా, హుందాగా ఉంది. జాన్సన్ కూతుళ్లు ముగ్గురూ నర్తకిని అంటిపెట్టుకొని ఉన్నారు.

జాన్సన్ కూతుళ్లు నర్తకిని తీసుకెళ్లి తండ్రి ముందు నిలబెట్టారు. ఈవిడ ఎవరో గుర్తుపట్టాలంటూ అమ్మ సుశీలమ్మకూ పరీక్ష పెట్టారు. భార్యాభర్తలిద్దరూ తెల్లముఖాలేశారు. పక్కనున్న రామకృష్ణాచారి ముసి ముసి నవ్వులు నవ్వుతున్నాడు. హఠాత్తుగా నర్తకి జాన్సన్ దంపతుల పాదాలు తాకి నమస్కారం చేసింది. ఆచారి మెల్లగా 'అది అలివేలు' అన్నాడు. అంతే, సుశీలమ్మ నర్తకిని వాటేసుకుంది. జాన్సన్ కళ్లు మరోసారి మెరిశాయి. వాళ్ల కళ్లలో మెరుపులు చూసి నర్తకి చాలా సంతోషించింది.

అలివేలు పేరు ఇప్పుడు నర్తకి. దేశమంతా తెలిసిన క్లాసికల్ డాన్సర్. నర్తకిని ఇదివరకు చాలాసార్లు టీవీలో చూశారు జాన్సన్, సుశీలమ్మ. కాని ఆమె అలివేలని, రామకృష్ణాచారి కూతురని తెలియదు. వాళ్ల ముగ్గురు కూతుళ్ల పరిస్థితీ అదే. అసలు మీడియాలో కనిపించే నర్తకికి, జాన్సన్ పుట్టినరోజు వేడుకకు వచ్చిన నర్తకికి పోలికే లేదు. మేకప్ లేకుండానే నర్తకి చాలా అందంగా ఉంది.

నర్తకి స్వతంత్ర వ్యక్తిత్వమున్న మనిషి. స్వేచ్ఛాజీవి. ఆమె పూర్వాపరాలు తెలిసినవాళ్లు తక్కువ. పైగా డాన్సింగ్ ప్రొఫెషన్ ఎంచుకోవడంతోటే అలివేలు నర్తకిగా మారిపోయింది. రామకృష్ణాచారి తన కొడుకు దగ్గర మద్రాసులో సెటిలైపోతే, నర్తకి ఢిల్లీలో ఉంటూ చెన్నయ్ వచ్చి వెళుతుంటుంది. మనిషిని చూస్తే అనిపించదుగానీ, చాలా ఖరీదైన లైఫ్ స్టయిల్ నర్తకిది. ఆ స్టేటస్ అంతా ఢిల్లీలో కనిపిస్తుంది. ఎందుకనో నర్తకి పెళ్లి చేసుకోలేదు. కానీ ఆమె స్నేహాల గురించి చాలా కథలు వినిపిస్తుంటాయి. ముఖ్యంగా ఆమె ఇద్దరు కూతుళ్లు ఎవర్ గ్రీన్ టాపిక్.

నర్తకి జాన్సన్, సుశీలమ్మ దగ్గర ఉండగానే మేనల్లుడు రామ్ డేవిడ్‌ను అక్కడికి తీసుకొచ్చాడు. ఈమె ఎవరో చెప్పుకో చూద్దామంటూ మేనకోడళ్లు డేవిడ్‌ను ఆటపట్టించారు. డేవిడ్ తన బ్లాక్ అండ్ వైట్ గడ్డాన్ని సవరించుకుంటూ నర్తకివేపు చూసి రెండు చేతులూ జోడించి నమస్కారం పెట్టాడు. "ఈమె నాకు తెలుసు. క్లాసికల్ డాన్సర్ నర్తకి. చాలా పెద్ద నేమ్," అన్నాడు పిల్లలతో. అందరూ గొల్లున నవ్వారు. 'ఆ విషయం మాకూ తెలుసమ్మా. అంతకన్నా తెలిస్తే చెప్పు' అంటూ రెట్టించారు. సుశీలమ్మ కలుగజేసుకుని 'వీరిని గుర్తుపట్టావా?' అంటూ రామకృష్ణాచారిని చూపించింది. ఎంతో నిబ్బరంగా ఉండే డేవిడ్ క్షణంసేపు కాస్త తడబడ్డాడు.

అందరి దృష్టీ డేవిడ్ చెప్పబోయే సమాధానం మీద ఉంటే, నర్తకి మాత్రం అక్కడ డేవిడ్‌ను చూసి ఆశ్చర్యపోయింది. వీళ్లేమిటి ఇంత పెద్ద ఆర్టిస్టును ఇలా ఆట పట్టిస్తున్నారని ఒక్కక్షణం బిత్తరపోయింది. మెల్లగా వాళ్ల మధ్య రిలేషన్ అర్థమైంది. రైల్వే స్కూల్లో తన క్లాస్‌మేట్ డేవిడ్ లీలగా కనిపించాడు. పొడవాటి గడ్డంతో ఋషిలా కనిపిస్తున్న ఈ డేవిడ్‌ను ఇంకా ఇబ్బందిపెట్టడం సబబు కాదనుకుంది. సంతోషాన్నంతా

తన చేతిలోకి తీసుకొని డేవిడ్‌తో కరచాలనం చేస్తూ చెప్పింది, "నేను నర్తకిని కాదు, పాకాల అలివేలును," అని.

డేవిడ్ కొన్ని క్షణాలు బ్లాంక్ అయిపోయాడు. తన కళ్లను తాను నమ్మలేకపోయాడు. ఇదెలా సాధ్యమైందో అతనికి బోధపడలేదు. నర్తకిని కళ్లార్పకుండా చూస్తుండి పోయాడు. మేనల్లుడు రామ్ వెనక నుంచి వచ్చి డేవిడ్‌ను గట్టిగా వాటేసుకున్నాడు. అతను జాన్సన్ వైపు కొంటెగా చూస్తూ, "ఎలా ఉంది నా సర్‌ప్రైజ్ గిఫ్ట్ తాతయ్యా," అన్నాడు. అప్పుడు అర్థమైంది తండ్రి జాన్సన్‌కూ, కొడుకు డేవిడ్‌కూ... రామకృష్ణాచారినీ, నర్తకినీ వెదికి పట్టుకొచ్చినవాడు రామ్ అని.

డేవిడ్ తన మేనల్లుడి తల నిమురుతూ నర్తకి వైపే చూస్తున్నాడు. 52 ఏళ్ల నర్తకి చిన్నపిల్లలా మారిపోయింది. 'సర్‌ప్రైజ్' అనే మాట సరిపోదనుకుంది ఆమె. ఇద్దరూ కాసేపు ఆశ్చర్యం నుంచి తేరుకునే మాటలే మాట్లాడారు. అంతకుమించి మాట్లాడుకొనే వీల్లేకుండా రామ్ తన పథకం ప్రకారం తాతయ్య పుట్టినరోజు వేడుకలోకి లాక్కెళ్లాడు అందర్నీ. వేడుక పూర్తయ్యాక డేవిడ్‌ను హైదరాబాద్ ఆర్టిస్టులు ఎత్తుకెళ్లారు నైట్ పార్టీకి.

వేడుక జరిగిన స్టార్ హోటల్లోనే రామకృష్ణాచారికి, నర్తకికి సూట్ బుక్ చేశాడు రామ్. తండ్రీ కూతుళ్లు ఏం మాట్లాడుకున్నారో ఏమో, ఫంక్షన్ అయిపోయాక ఆ సూట్ వెకేట్ చేసి జాన్సన్, సుశీలమ్మ ఉంటున్న వాళ్ల పెద్ద కూతురు ఇంటికి వస్తామన్నారు. ఆ రాత్రికి జాన్సన్ మిగతా ఇద్దరు కూతుళ్లు కూడా అక్కడికే చేరుకున్నారు. నలభై ఏళ్లు వెనక్కివెళ్లి పాత పాకాల సంగతులు నెమరు వేసుకున్నారు. పన్నెండయ్యేసరికి పెద్దవాళ్లు ముగ్గురూ నిద్రపోయారు. నర్తకి, జాన్సన్ ముగ్గురు కూతుళ్లూ తెల్లవారు ఝాము 2 గంటల దాకా కబుర్లు చెప్పుకుంటూనే ఉన్నారు. ఆ కబుర్లలో ఎక్కువసేపు మాట్లాడుకుంది అక్కడ లేని డేవిడ్ గురించే.

డేవిడ్ మందు పార్టీలో కూడా అదే జరిగింది. అక్కడ లేని నర్తకి గురించే ఆర్టిస్టులంతా మాట్లాడారు. ఆమె అందాన్ని ఆకాశానికెత్తుతూనే నర్తకి గురించి చాలా లూజ్ టాక్ చేశారు. డేవిడ్ ఆహ్వానం మేరకే ఆమె హైదరాబాద్ వచ్చిందని కొందరనుకుంటే, కొందరు డేవిడ్‌తో కలిసే వచ్చిందని ఊహించుకున్నారు. ఈ తాగుబోతుల చర్చలో ఎక్కడా నర్తకి గురించి చిన్న మాట కూడా మాట్లాడనిది డేవిడ్ ఒక్కడే.

తెల్లవారుజామున నాలుగు గంటల ప్రాంతంలో డేవిడ్‌ను తీసుకొని రామ్ ఇంటికొచ్చాడు. ఎవరికీ ఇబ్బంది లేకుండా మామయ్యను మేడమీదున్న ఆయన స్టూడియోకు తీసుకెళ్లాడు. డేవిడ్ ఎప్పుడు హైదరాబాద్ వచ్చినా అక్కడే ఉంటాడు. ఈ ఏర్పాటు కూడా రామ్ చేసిందే. డేవిడ్‌కు సంబంధించిన అన్ని వ్యవహారాలూ రామే చూస్తుంటాడు. బాగా డ్రింక్ చేసి ఉన్నా... డేవిడ్ బుర్ర ఆ టైంలో కూడా చురుగ్గా ఆలోచిస్తోంది. అలివేలు తిరిగి కనిపించడం కలా నిజమా అని తనను తాను ప్రశ్నించుకున్నాడు. ఇంత అద్భుతమైన స్త్రీ తన బాల్యస్నేహితురాలంటే నమ్మలేకపోయాడు. ఈ కలయిక అపురూపమనుకున్నాడు. ఒక పట్టాన నిద్ర పట్టలేదు డేవిడ్‌కు. ఉదయం పదింటికి కింద హాల్లోకి వచ్చిన డేవిడ్‌ను చూడగానే రామకృష్ణాచారి ఎదురొచ్చి కౌగిలించుకున్నాడు. "రాత్రంతా నీ కబుర్లేనయ్యా... యు ఆర్ రియల్లీ గ్రేట్," అంటూ డేవిడ్ భుజాలు పట్టి గట్టిగా ఊపేశాడు.

నర్తకి కూడా అలాంటి భావాన్నే కళ్లలో పలికిస్తూ డేవిడ్ వైపు అభినందనపూర్వకంగా చూసింది. బ్రేక్‌ఫాస్ట్ పూర్తయ్యాక రామకృష్ణాచారి డేవిడ్‌తో అన్నాడు, "సాయంత్రం ఆరున్నరకు చెన్నయ్ ఫ్లయిట్ ఎక్కుతున్నామయ్యా," అని.

రామ్ కల్పించుకొని, "మామయ్య కూడా ఈవినింగ్ సిక్స్‌కే ముంబై వెళ్లిపోతున్నారు," అన్నాడు. అందర్నీ తానే ఎయిర్‌పోర్టులో డ్రాప్ చేస్తానని చెప్పి బయటికి వెళ్లిపోయాడు.

హాల్లో కూర్చున్న జాన్సన్, సుశీలమ్మ, రామకృష్ణాచారి మళ్లీ పాకాల పాత జ్ఞాపకాలు నెమరువేసుకుంటున్నారు. నర్తకి, డేవిడ్ ఈ సంభాషణలో లేరు. ఇద్దరూ ఏదో ఆలోచిస్తూ అప్పుడప్పుడూ ఊ కొట్టినట్టు తలలు ఊపుతున్నారు. అది గమనించిన డేవిడ్ పెద్దక్క, "అలివేలుకు నీ స్టూడియో చూపించవా!" అంది. డేవిడ్ నర్తకి వేపు చూసి మెల్లగా అక్కడ్నుంచి లేచాడు.

నర్తకి డేవిడ్ వెంట నడిచింది. డేవిడ్ స్టూడియో డోర్ ఓపెన్ చేస్తుంటే, గుసగుసల స్థాయి స్వరంతో, "ఇది కలా నిజమా డేవిడ్!" అంది నర్తకి.

"స్కూల్ ఎగ్గొడితే అమ్మకు చెప్పి కొట్టించింది నువ్వే కదూ!" అని డేవిడ్ ఎక్కడో దాచిన జ్ఞాపకాన్ని చప్పున బయటకు తీశాడు. ఇద్దరి ముఖాలూ కాసేపు మౌనంగా నవ్వుకున్నాయి.

నర్తకి స్టూడియోలో కలియదిరుగుతూ పెయింటింగ్స్ చూస్తోంది. ఆమెను డిస్టర్బ్ చేయకూడదన్నట్టు

డేవిడ్ కామ్‌గా కూర్చుండిపోయాడు. కాసేపటికి నర్తకి వచ్చి పక్కన నుంచుంది. "అన్నీ న్యూడ్సే. అందుకే నీ పెయింటింగ్స్ అంటే నాకు చాలా ఇష్టం. మనుషుల్ని నగ్నంగా తప్ప మరోలా చూసి అర్థం చేసుకోలేము. బాడీ లాంగ్వేజ్ అద్భుతంగా పట్టేశావు డేవిడ్," అంది. ఆ కాంప్లిమెంట్‌కు డేవిడ్ థ్రిల్లయ్యాడు. నవ్వుతూ చేత్తో సైగ చేయగానే అతని ఎదురుగా వచ్చి కూర్చుంది నర్తకి.

ఇద్దరికీ ఆశ్చర్యంగా ఉంది. అపరిచితుల మధ్య ఈ ఆకర్షణ ఎక్కడి నుంచి వచ్చిందని. ఒకరినొకరు అప్పుడే డిస్కవర్ చేసినట్టు ఇద్దరి కళ్లూ మెరుస్తున్నాయి.

"నా బొమ్మ గీస్తావా?" అంది నర్తకి సంభాషణ ముందుకు సాగడం కోసం.

"ఇప్పటి నర్తకిని కాదుగానీ, అలివేలునైతే అలవోకగా గీయగలను," అన్నాడు డేవిడ్ స్వరంలో కొంచెం కొంటెతనం స్ఫురించేలా.

"నిజంగా అలివేలు అంత గుర్తుందా నీకు!" ఆశ్చర్యపోయింది నర్తకి.

"నా మెమొరీ చాలా పవర్‌ఫుల్. అది ఎంత షార్పంటే, ఐదోతరగతి నాటి నీ రూపాన్ని అప్పటి నీ ఫ్రాక్ కలర్, డిజైన్‌తో సహా పెయింట్ చేసి చూపిస్తాను," అన్నాడు డేవిడ్ ఉత్సాహంగా.

"సారీ డేవిడ్... నువ్ ఆర్టిస్టువి కాబట్టి నీకా గిఫ్టెడ్ మెమొరీ ఉందేమోగానీ ఆ విషయంలో నేను చాలా పూర్. నిన్న మీ పేరెంట్స్‌తో మాట్లాడేదాకా నాకు ఆ పాకాల సంగతులు పెద్దగా గుర్తులేవు. రాత్రి నీ గురించి చాలా విషయాలు చెప్పారు," అంది నర్తకి తన జ్ఞాపకశక్తి మీద తనే కంప్లయింట్ చేస్తూ.

డేవిడ్, నర్తకి ఎంతసేపు మాట్లాడుకున్నా గతంలోనే సంచరించారు తప్ప వర్తమానంలోకి రాలేదు. డేవిడ్ గురించి నర్తకి అంతో ఇంతో తెలుసుకుంది కాని డేవిడ్‌కు అలాంటి అవకాశం రాలేదు. ఈ మాత్రం పరిచయానికే అంత చనువు అక్కర్లేదనుకున్నట్టు లేరు కాని ఇంతకన్నా మంచి సమయం, సందర్భం కోరుకుంటున్నట్టు ఉన్నారు. సడన్‌గా డేవిడ్ ఓ ప్రతిపాదన చేశాడు... "ఓసారి పాకాల వెళ్దాం వస్తావా!" అని.

నర్తకి ఆశ్చర్యపోయి చూస్తుండగానే డేవిడ్ తనే అన్నాడు... "మళ్లీ మన రైల్వే స్కూలుకు వెళ్దాం. ఐదో తరగతి తర్వాత సంగతులన్నీ షేర్ చేసుకుందాం. ఓ పది రోజుల్లో నేను ఫ్రీ అవుతాను. ముంబై నుంచి నేరుగా తిరుపతి వస్తాను. నువ్వక్కడికొస్తే కలిసి పాకాల పోదాం."

డేవిడ్ ప్రతిపాదన, ఆ ప్రతిపాదన చేయడంలో అతను చూపిన ఉత్సాహం నర్తకికి బాగా నచ్చాయి. డేవిడ్ పట్ల తనలో కలిగిన క్యూరియాసిటీకి సమాధానమా అన్నట్టు ఉందా ప్రతిపాదన. అందుకే, "ఏ విషయం రెండ్రోజుల్లో చెబుతాను," అంది నర్తకి.

రెండ్రోజులు గడువు కోరిందనేగానీ, నర్తకి మనసు ఆ క్షణమే నిర్ణయించుకుంది పాకాల వెళ్లాలని. ఎంతో విస్తృతమైన, విలాసవంతమైన జీవితాన్ని చూసిన నర్తకి ఈమధ్య ఎందుకోగాని ఒక వెలితి బాగా ఫీలవుతోంది. వెనక్కి తిరిగి చూసుకుంటే ఆమెకు ఎవరూ కనిపించడం లేదు. ఇన్నాళ్లకు డేవిడ్ కనిపించాడు. మనసు విప్పి మాట్లాడాల్సిన మనిషి అతనే అనిపించాడు. సరిగ్గా డేవిడ్ కూడా నర్తకి గురించి అలా అనుకొనే పాకాల పోదామన్నాడు. ఇద్దరి మధ్యా ఒక అప్రకటిత అవగాహన కుదిరింది.

లంచ్ కాగానే ఎయిర్‌పోర్టుకు కారు రెడీ చేసి పెట్టాడు రామ్. ఆచారి చేయి పట్టుకొని జాన్సన్, నర్తకిని వాటేసుకొని సుశీలమ్మ ఇంట్లో నుంచి బయటకొచ్చారు. వాళ్ల వెనకాలే డేవిడ్ వచ్చాడు.

కారు ఎయిర్‌పోర్టు చేరే వరకు ఆచారే మాట్లాడుతూ వచ్చాడు. మధ్యమధ్యలో రామ్ ఒకటి రెండు ముక్కలు మాట్లాడాడుగానీ, వెనుక సీట్లలో ఉన్న డేవిడ్, నర్తకి కనీసం ఊ కొట్టిన చప్పుడు కూడా రాలేదు. కారు దిగాక ఫార్మాలిటీస్ పాటించారు. ఓసారి ముంబై రండంటూ ఆచారిని డేవిడ్ ఆహ్వానించాడు. మామయ్య విజిటింగ్ కార్డ్‌ను నర్తకి చేతికిచ్చాడు రామ్.

హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ నుంచి విమానాలు రెండూ అరగంట తేడాలో చెరో దారిన ఎగిరిపోయాయి... మనుషుల్ని విడదీస్తూ మనసుల్ని కలుపుతూ.

*

ముంబై వెళ్లాక డేవిడ్ తన రొటీన్‌లో పడ్డాడు. నర్తకి చెన్నయ్ వెళ్లిన మరుసటి రోజే తిరిగి ఢిల్లీ వెళ్లింది. ఇల్లు చేరినప్పటి నుంచి ఆమె చేస్తున్న ఒకే ఒక పని డేవిడ్ గురించి తెలుసుకోవడం. ఇంటర్నెట్ సెర్చ్ చేస్తే కొంత సమాచారం దొరికింది. అదంతా అతడి ఆర్టిస్టు జీవితానికి సంబంధించినదే. పర్సనల్ డిటెయిల్స్ పెద్దగా లేవు. డేవిడ్ గురించి పత్రికల్లో వచ్చిన ఆర్టికల్స్ కొన్ని దొరికాయి. అందులో పన్నెండేళ్ల క్రితం The Unsung DAVID, రెండేళ్ల క్రితం వచ్చిన Hussain My Father వ్యాసాలు నర్తకి దృష్టిని ఆకర్షించాయి. మొదటి ఆర్టికల్ ఆర్టిస్ట్‌గా డేవిడ్ గొప్పతనాన్ని ఆవిష్కరిస్తే, రెండవది వ్యక్తిగా డేవిడ్ ఎమోషన్స్‌ని పట్టుకునే ప్రయత్నం చేసింది. ఈ రెండూ చదివాక డేవిడ్‌కు మెయిల్

చేసింది. 'నువ్ ఎప్పుడంటే అప్పుడు పాకాల రావడానికి నేను సిద్ధంగా ఉన్నాను,' అని.

డేవిడ్ రిప్లయ్ ఇచ్చాడు. ఫలానా తేదీన ఫలానా ఫ్లయిట్‌కు బయలుదేరి వస్తున్నానని. ఆ తర్వాత ఇద్దరి మధ్య మరికొంత కరస్పాండెన్స్ నడిచింది. నర్తకి Hussain My Father మళ్లీ మళ్లీ చదువుకుంటోంది.

ఆర్టిస్టుగా, వ్యక్తిగా డేవిడ్‌ను ఎంఎఫ్ హుస్సేన్‌తో పోలుస్తూ ఓ కుర్ర ఆర్ట్ క్రిటిక్ రాసిన ఆర్టికల్ Hussain My Father. ఎం.ఎఫ్ హుస్సేన్‌లాగే డేవిడ్ జీవితంలోనూ చాలామంది గ్లామర్ గాళ్స్ ఉన్నారన్నది ఆ ఆర్టికల్ సారాంశం. ఇది చదివాక డేవిడ్ పట్ల నర్తకి ఆసక్తి మరింత పెరిగింది. పాకాలలో డేవిడ్‌ను కలిసేలోగా అతని గురించి ఒక అవగాహనకు రావా లన్నది ఆమె తాపత్రయం.

*

బాల్యమిత్రులు కూడబలుక్కున్న ఆ రోజు రానే వచ్చింది. డేవిడ్ కన్నా ముందే చెన్నయ్ నుంచి కారులో తిరుపతి చేరుకున్న నర్తకి స్వయంగా ఎయిర్‌పోర్టుకెళ్లి డేవిడ్‌ను రిసీవ్ చేసుకుంది. ఇద్దరూ హోటల్‌కెళ్లి కాస్త ఫ్రెషయి కాఫీ తాగి వెంటనే పాకాల బయలుదేరారు. మధ్యాహ్నం 12 గంటలకు తిరుపతిలో బయలుదేరిన కారు గంటలో పాకాల చేరుకుంది.

పాకాల పోలిక లేకుండా మారిపోయింది. డ్రైవర్ అక్కడక్కడా ఆగి వాకబు చేస్తూ రైల్వే స్కూల్ వైపు వెళుతున్నాడు. కాసేపటికి కారు స్కూలు ఆవరణలోకి ప్రవేశించింది. ఇదివరకున్న సువిశాలమైన గ్రౌండ్ సగానికి సగం కుంచించుకుపోయింది. కొత్తగా వచ్చిన బిల్డింగ్స్ వాళ్ల జ్ఞాపకాలతో మ్యాచ్ కాలేదు. కొన్ని చెట్లు అలానే ఉన్నాయి. ముఖ్యంగా స్కూల్ మెయిన్ బిల్డింగ్‌కు కుడివైపునున్న మర్రిచెట్టు ఊడలు దిగి మరింత విస్తరించాయి.

మర్రిచెట్టుకు కాస్త దూరంలో కారు ఆగింది. డేవిడ్, నర్తకి కారు దిగి చుట్టూ ఉన్న వాతావరణాన్ని పోల్చుకోవడానికి ప్రయత్నించారు. ముందుగా స్కూల్ అంతా ఓ రౌండేసి వద్దామనుకున్నారు. అరగంటలో ఆ పని పూర్తిచేసి తిరిగి మర్రిచెట్టు నీడకొచ్చి కూర్చున్నారు.

డేవిడ్, నర్తకి ఇప్పుడు ఒకరినొకరు చాలా దగ్గరగా చూస్తున్నారు. మధ్యాహ్నం వెలుగులో ఇద్దరి ముఖాల్లోనూ ఫీలింగ్స్ కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నాయి. డేవిడ్ బాగా ఎక్సయిట్ అయినట్టు తెలిసిపోతోంది. నర్తకి ముఖంలోనూ ఐదో తరగతి అలివేలు ప్రత్యక్షమైంది గానీ, ఆమె ఎమోషన్స్ కంట్రోల్లోనే ఉన్నాయి. ఆది వారం కావడం వల్ల స్కూల్లో పిల్లల సందడి లేదు.

"అసలు పాకాల రావాలని ఎందుకనిపించింది నీకు? పైగా నన్నెందుకు తోడు పిలిచావ్?" అంటూ నర్తకి నవ్వుతూ అడిగింది. డేవిడ్ వెంటనే సమాధానం చెప్పలేక నవ్వి ఊరుకున్నాడు. మెల్లగా మాటలు కూడదీసుకుని బదులిచ్చాడు...

"అలిసిపోయాను అలివేలు. తోడు కోసం వెదికి వెదికి అలసిపోయాను. ఎంత వెదికినా నాతో నా భాష మాట్లాడగలిగే ఒక్క మనిషి తోడూ సంపాదించుకోలేకపోయాను. నాకున్న అసంతృప్తి అంతా అదే. నా రిగ్రెట్ అదే. ఈరోజు డేవిడ్‌కు ఉన్న పేరు, డబ్బుతో నాకే మాత్రం సంబంధం లేదు. ఒక్క ప్రియురాలూ లేని డేవిడ్ నా దృష్టిలో అనామకుడు, బికారి... ఆశ చావలేదు అలివేలూ... ఇప్పటికీ వెదుకుతూనే ఉన్నాను. నా రంగుల కలను నిజం చేసే స్త్రీ కోసం. ఇప్పుడలాంటి ఆశ నీ మీద కలిగింది. నేను వెదుకుతున్న తోడు నీలో కనిపించింది. నాలాగే నీవూ ఒంటరివని తెలిసి ఆశ పెంచుకున్నాను. అందుకే నిన్ను ఇక్కడిదాకా తీసుకొచ్చింది. నువ్వు మెచూర్డ్ లేడీవి. అపార్థం చేసుకోవని తెలుసు..." అంటూ డేవిడ్ బడిపిల్లాడిలా మనసులోని మాట ఒప్పజెప్పేశాడు.

డేవిడ్ మాటలకు అడ్డుపడకూడదనుకుంది నర్తకి. డేవిడ్ మరింత ఓపెన్ అయ్యేలా, అతను మాట్లాడుతున్నంతసేపూ తన చూపులో ఎక్కడా తిరస్కారంగానీ, అభ్యంతరంగానీ కనిపించకుండా జాగ్రత్త తీసుకుంది.

నర్తకి తన మొర ఆలకిస్తోందని అనిపించగానే డేవిడ్ మళ్లీ తనే మాట్లాడాడు...

"సొసైటీలో నీకున్న పేరుప్రతిష్ఠలు తప్ప నీ గురించి నాకేం తెలియదు అలివేలూ. బయటివాళ్లు ఇచ్చే సమాచారం మీద నాకు పెద్దగా గౌరవం ఉండదు. నీ గురించి నువ్ చెబితేనే తెలుసుకుంటాను. అంతకంటే ముందు నన్ను నేను నీకు పరిచయం చేస్తాను. పాకాల తర్వాత నా ప్రయాణమంతా చెబుతాను," అన్నాడు. డేవిడ్ ఈ ప్రతిపాదన చేయగానే నర్తకి స్వరం మరింత ఆప్యాయంగా మారింది.

"చెప్పు డేవిడ్. నీ గురించి తెలుసుకోవడానికే ఇంత దూరం వచ్చాను. చాలా క్యూరియాసిటీతో వున్నాను," అంది ఎంకరేజ్ చేస్తూ...

మెరిసే కళ్లతో డేవిడ్ మళ్లీ మాట్లాడాడు...

"చదువంటే నాకెప్పుడూ ఆసక్తిలేదు. టెన్త్ తర్వాత పాకాల నుంచి తిరుపతి కాలేజీకి మారినా నేను మార లేదు. అప్పటికి బొమ్మలు గీసే నా వ్యాపకం వ్యసనంగా మారింది. ఇంటికెళ్లిన ప్రతిసారీ అమ్మ అరిచి మొత్తు కునేది. ఇలాగైతే ఎలా బతుకుతావురా అని. ఏమీ అనేవాడు కాదుగానీ, నాన్నకూ అదే బెంగ. నాకెంతసేపూ బొమ్మలు గీయడం మీద తప్ప మరో ధ్యాస ఉండేది కాదు. ఆ బొమ్మలతో బతకడమెలాగో తెలిసేది కాదు.

"సరిగ్గా అలాంటి సంధికాలంలో డిగ్రీలో మా ఇంగ్లీష్ లెక్చరర్ మధుసూదనరావుగారు నన్ను ఆదు కున్నారు. సలహా కోసం ఓ రోజు ఆయన ఇంటికెళితే ఒకటే మాటన్నారు. 'నీ మనసుకు ఏది నచ్చితే అదే చెయ్. నీ కాన్సన్‌ట్రేషన్ అంతా దానిమీదే పెట్టు. గొప్ప గొప్ప ఆర్టిస్టులంతా బిగినింగ్‌లో ఇలాంటి సమస్యలు ఎదుర్కొన్నవాళ్లే. నువ్వూ ఏదో ఒకరోజు గొప్పవాడివి అవుతా,'వన్నారు. ఆ మాటన్నప్పుడు ఆయన నాకు ధైర్యమిచ్చారని అనుకున్నానే తప్ప ఆయన బ్లెస్ చేసి నట్టు భవిష్యత్తులో పెద్ద ఆర్టిస్టునవుతానని ఏ కోశానా నమ్మలేదు. తర్వాత ఆయనే నా చేత ఆర్ట్ హిస్టరీ చదివించారు. పికాసో మొదలుకొని ఎంఎఫ్ హుస్సేన్ దాకా గ్రేట్ ఆర్టిస్టులను పరిచయం చేశారు. డిగ్రీ డిస్ కంటిన్యూ చేసి, మద్రాసెళ్లి అవకాశాల కోసం ప్రయ త్నించమని నాలో తెంపరితనాన్ని ఆయనే నూరిపోశారు.

"మద్రాసులో ఉన్నంతకాలం సినిమాలు నాకు అన్నం పెట్టాయి. అయితే నేను చేసేది ఆర్ట్ కాదని, ఆర్ట్ వేరే ఉందని పదేపదే గుర్తుకొచ్చి గింజుకునేవాడిని. వచ్చిన నాలుగు డబ్బులతో కాన్వాసులు, రంగులు కొని రేయింబవళ్లు బొమ్మలేసే వాడిని. అయినా రంగులతో రూపాయిలు సంపాదించడం నాకు తెలియలేదు. మద్రాసులో ఉండగా కొన్ని వేల పెయింటింగ్స్ ఉచి తంగా పంచి ఉంటాను.

"మద్రాసు నుంచి బాంబే వెళ్లాక కూడా నా నసీబ్ మారలేదు. పదేళ్లు అనామకంగా గడిచిపోయాయి. అశాంతితో గడిచిపోయాయి. డబ్బుల్లేవు. మిత్రుల్లేరు, ప్రియురాలు లేదు, రేపటి మీద ఆశలేదు... ఎవరికీ అక్కర్లేని ఓ రంగుల పిచ్చోడు డేవిడ్. నా జీవితంలో The Unsung DAVID ఆర్టికలే లేకపోతే బాంబే మురికి వాడల్లో అనామకంగా చచ్చిపోయి ఉండేవాడ్ని. ఆ ఆర్టికల్ నన్ను బతికించింది. నా జీవితాన్ని ఊహించని మలుపు తిప్పింది.

"పన్నెండేళ్ల క్రితం ఓ గమ్మత్తయిన సంఘటన జరిగింది. అప్పట్లో నేనో హిందీ సినిమాకు వర్క్ చేస్తు న్నాను. డైరెక్టర్ టేస్ట్ ఉన్నవాడు కావడంతో ప్రయోగాలు చేసే ఫ్రీడం దొరికింది. అప్పటివరకూ ఎవరూ చూడని నా పెయింటింగ్స్ కొన్నింటిని ఆ సినిమాలో వాడాను. సరిగ్గా ఆ టైంలో బాంబేలో ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ జరుగుతోంది. హాలీవుడ్ నుంచి చాలామంది స్టార్స్ వచ్చారు. అందులో టూ టైమ్స్ ఆస్కార్ గెలిచిన హాలీవుడ్ ఆర్ట్ డైరెక్టర్ విలియమ్స్ కూడా ఉన్నాడు. మా డైరెక్టర్ ఎంతో కష్టపడి విలియమ్స్‌ను తన సినిమా పోస్ట్ ప్రొడక్షన్ జరుగుతున్న స్టూడియోకు పట్టుకొచ్చాడు. ఆ సమయంలో నేనక్కడ లేను. కానీ నన్ను వెతుక్కుంటూ విలియమ్స్ నా రూమ్‌కు వచ్చాడు.

"విలియమ్స్ మా సినిమా ప్రివ్యూ చూస్తు న్నప్పుడు అతని దృష్టి అందులోని ఆర్ట్ వర్క్‌పై పడింది. ప్రత్యేకించి నేను డిజైన్ చేసిన బ్యాగ్రౌండ్స్ అతనికి ఆసక్తి కలిగిం చాయి. వెంటనే మా డైరెక్టర్‌ను వెంటబెట్టుకుని నా రూముకొచ్చాడు. అక్కడున్న నా పెయింటింగ్స్‌ని చూసి మరింత ఆశ్చర్యపోయాడు. నువ్వేమిటి ఇక్కడ ఇలా మట్టిగొట్టుకుపోయి ఉన్నావంటూ ప్రశ్నించాడు. నా దగ్గర సమాధానం లేదు. విలియమ్స్ ఓపిగ్గా నా గురించి అడిగి తెలుసుకున్నాడు. న్యూయార్క్ తిరిగి వెళ్లిపోతూ 'బాంబే టైమ్స్'కు అతను రాసిన ఆర్టికలే The Unsung DAVID.

"24 గంటల్లో నా జీవితం మారిపోయింది. మొత్తం నేషనల్ మీడియా నా వెంటపడింది. ఇంత గొప్ప ఆర్టిస్ట్ ఇన్నాళ్లూ ఎక్కడున్నాడని ఆశ్చర్యపోతూ పత్రికల్లో డజన్లకొద్దీ ఆర్టికల్స్ వచ్చాయి. టీవీ ఇంటర్వ్యూలు మోత పుట్టించాయి. మనకు మరో పికాసో దొరికాడంటూ ఆకాశానికి ఎత్తేశారు. ఏం జరుగుతోందో నేను తెలుసుకునేలోపే భారతీయ చిత్రకళా ప్రపంచంలో నన్నొక స్టార్‌ని చేసేశారు. కళ, కాసులు కలిసి రావడంతో రెండేళ్లలో నేనో సెలబ్రిటీగా మారిపోయాను."

అప్పటిదాకా డేవిడ్ చెబుతున్నది ఆసక్తిగా వింటూ వచ్చిన నర్తకి, "Hussain My Father కూడా చదివాను నేను," అంది.

నర్తకి ఆ ఆర్టికల్ ప్రస్తావన తీసుకురాగానే అప్పటి దాకా చాలా సీరియస్‌గా తన గతం చెప్పుకుంటూ పోతున్న డేవిడ్ కాస్త నిదానించి మాట్లాడాడు...

"Hussain My Father ఆర్టికల్ రెండేళ్ల క్రితమే వచ్చింది. గత ఐదారేళ్లుగా నన్ను సీరియస్‌గా ఫాలో అవుతున్న ఓ యంగ్ ఆర్ట్ క్రిటిక్ రాశాడది. ఒక రకంగా

ఆ ఆర్టికల్ నన్ను కూడా షాక్ చేసింది. వినికిడి జ్ఞానం మీద అతను అంత పెద్ద కథ అల్లాడు. ఎంఎఫ్ హుస్సేన్ వెంటపడ్డట్టే నా వెంట సినిమా హీరోయిన్లు పడుతున్నా రన్నది అతను చెప్పదలచుకున్న పాయింట్.''

''అయితే Hussain My Father లో రాసినవన్నీ నిజం కాదా? అసలు నువ్వు పెళ్లెందుకు చేసుకోలేదు డేవిడ్?'' అని అడిగింది నర్తకి.

నర్తకి క్యూరియాసిటీని అర్థం చేసుకున్న డేవిడ్ వెంటనే జవాబిచ్చాడు.

''ఆర్టిస్ట్‌గా బతకడం కోసమే నేను పెళ్లి వద్దను కున్నాను. నాకు అశాంతి కావాలి. నిత్యం నన్ను కాల్చేసే నిప్పేదో వెంట ఉండాలి. అలాగని నా జీవితం లో ఆడవాళ్లు లేరని కాదు. నేను కోరుకున్నవాళ్లు, నన్ను కోరుకొని వచ్చినవాళ్లు చాలామంది ఉన్నారు. ఎవరి తోనూ నాకు సంతృప్తిలేదు. నాతో నా భాష మాట్లాడ గలిగిన ఒక్క ఆడమనిషి నాకు తారసపడలేదు. అయినా వీళ్లెవరి మీదా నాకు చిన్నచూపు లేదు. కొందరు ప్రేమ నటిస్తారు, అయినా నేనది ప్రేమగానే భావిస్తాను. నాతో స్నేహం చేసి, నాతో రాత్రులు గడిపి నా పెయిం టింగ్స్ కానుకల కింద పట్టుకెళ్లి అమ్ముకున్న అమ్మా యిల మీద కూడా నాకు అమితమైన గౌరవమే ఉంది.

''డేవిడ్‌కు డబ్బొచ్చాకే అతని చుట్టూ ఆడ వాళ్లు మూగారు. అంతకుముందు డేవిడ్ వైపు తొంగి చూడని అందగత్తెలంతా అతణ్ణి ప్రేమించారు. నా వయసుతో, నా స్టేటస్‌తో, నా డబ్బుతో సంబంధం లేకుండా నన్ను కోరుకున్న స్త్రీలున్నారు. వీళ్లెవరూ నా ప్రపంచంలోకి తొంగి చూడలేకపోయారు. నాకెప్పుడూ ఓ విచిత్రమైన భావన కలుగుతుంటుంది నర్తకీ... నా బాల్య ప్రియురాలు స్మృతి ఏదో నన్ను నడిపిస్తోందని. ఈ కారణంగానే నిన్ను చూడగానే చిరపరిచితవు అనిపిం చావు. నేను వెదుకుతున్న ప్రియురాలు నీవేననిపిం చావు నర్తకీ...''

డేవిడ్ అలిసిపోయాడు. శక్తినంతా కూడదీసుకుని తనను తాను ఆవిష్కరించుకుని అలిసిపోయాడు. ఈ అలసటను నర్తకి గమనించింది. కాసేపు మౌనానికి దారిచ్చింది. ఆసక్తికరమైన డేవిడ్ ప్రయాణం గురించి, అతని ప్రేమ జీవితం గురించి తెలిసాక తేలికపడ్డ నర్తకి మనసులో క్రమంగా కొత్త అలజడి మొదలైంది. ఇక తన వంతు. 40 ఏళ్లుగా తన జీవితంలో ఏం జరిగిందో అంతా చెప్పాలి. డేవిడ్ చెప్పినంత నిజాయితీగా, ఓపెన్‌గా చెప్పాలి. ఇవాళ డేవిడ్ మీద కలిగిన ఆసక్తికి కారణాలేమిటో కూడా చెప్పగలగాలి. అన్నిటికీ మించి ఈ శరీరం మీదే తాను ఇంత పెద్ద సౌధం నిర్మించానని స్పష్టంగా చెప్పాలి. కాని... ఇప్పటికిప్పుడు ఇన్ని విషయాలు తాను చెప్పలేననుకుంది నర్తకి. ఇక తను మాట్లాడితే విందామన్నట్టు ఆశగా చూస్తున్న డేవిడ్‌ను నర్తకి గమనించింది. అతనికి మరింత దగ్గరగా జరిగి ఆప్యాయంగా భుజంపై చెయ్యేసి మాట్లాడింది.

''థాంక్యూ డేవిడ్! జీవితంలో ఇలాంటి సందర్భం వస్తుందని ఊహించలేదు. ఎంత ఎక్సైటవుతున్నానో చెప్పలేను. నేను చాలా అదృష్టవంతురాలిని. ఈ అను భవం అద్భుతంగా ఉంది. నా బాల్యమిత్రుడిలో స్వాప్నికుణ్ని చూసినందుకు, అతని స్వప్నలోకంలో నాకు స్థానం ఉన్నందుకు గర్వంగానూ ఉంది. ఇవాళ నా శక్తినంతా నువ్ లాగేసుకున్నావు డేవిడ్. ఇక నా దగ్గర మాటల్లేవు. ఇప్పుడు నేనేమీ మాట్లాడలేను. నాకు కొంత సమయం కావాలి. నేను ఇంకాస్త ప్రిపేరవాలి. తొందర్లో మళ్లీ కలుద్దాం...'' అంటూ నర్తకి డేవిడ్‌ను సముదా యించేలా మాట్లాడింది.

నిజానికి డేవిడ్ నర్తకి సంజాయిషీ వినే స్థితిలో లేడు. పైగా, అతనికి ఆమె స్పందన మీద తప్ప ఆమె గతంమీద ఆసక్తి లేదు. నర్తకిలో అలివేలు తప్ప మరో మనిషెవరూ డేవిడ్ కంటికి కనిపించడంలేదు. గుండెల నిండా తృప్తిగా ఊపిరి పీల్చుకుని లేచి నిలబడ్డాడు. కొత్తగా అబ్బిన చొరవతో నర్తకికి చేయందించాడు. ఇక ఆ చేతులు ఎప్పటికీ విడిపోకూడదనుకున్నారు మనసుల్లో ఇద్దరూ. మర్రిచెట్టు కింద కారెక్కుతుంటే బిలబిలమంటూ పిల్లలొచ్చి చుట్టూ మూగారు. అతి కష్టం మీద కారు పాకాల పొలిమేర దాటింది. పచ్చని చెరకు తోటల తియ్యటి గాలుల్ని చీల్చుకుంటూ కారు దూసుకుపోయింది.

*ఆదివారం ఆంధ్రజ్యోతి, 8 ఏప్రిల్ 2012*

